క్లుప్తంగా

నేడు గంగమ్మ ఆలయంలో లీజు వేలం

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు వివిధ పనుల లీజు కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ మమత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, రవిక పీసులు సేకరణ లీజు హక్కు నిమిత్తం హిందూ దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. 2024 జూలై 29 నుంచి 2025 జూలై 28వ తేదీ వరకు పనుల లీజు హక్కు ఉంటుందని వెల్లడించారు. వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అలరించిన దుర్యోధనుని వధ


తలపడుతున్న దుర్యోధన, భీమ వేషధారులు

రామచంద్రాపురం: మండలంలోని పరమాల సమీపంలో ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ప్రదర్శించిన దుర్యోధనుని వధ ఘట్టం అలరించింది. దుర్యోధనుని, భీముని వేషధారులు బొమ్మయ్యపల్లి కిరణ్, మొరవ అశోక్ అద్భుతంగా నాటక ప్రదర్శన చేశారు. వందలాది మంది భక్తుల గోవిందనామ స్మరణ నడుమ అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యంతో పాటు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం


ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించిన రోటరీ క్లబ్ సభ్యులతో రిజిస్ట్రార్ తదితరులు

తిరుపతి సిటీ : ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా ఎస్వీయూలో క్లీన్ క్యాంపస్–గ్రీన్ క్యాంపస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తెలిపారు. ఆదివారం వర్సిటీలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న రోటరీ క్లబ్ స్వచ్ఛంద సేవకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కాలుష్యం మానవాళికి, వన్య ప్రాణులకు అత్యంత ప్రమాదకరమని తెలిపారు. పర్యావరణ వ్యవస్థకు ప్లాస్టిక్ కారణంగా తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. వర్సిటీలో విద్యార్థులతో వలంటీర్ల బృందాలను ఏర్పాటు చేసి క్లీన్ క్యాంపస్, గ్రీన్ క్యాంపస్ కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు జయరామ్ ప్రసాద్, సభ్యులు శివాజీ, నాగోతు హరికృష్ణ, స్వచ్ఛంద సేవకులు మార్కండేయ, ధరణి పాల్గొన్నారు.

మధుమేహ నియంత్రణకు ‘ఆయుష్’


ఆయుష్ ప్రాముఖ్యతపై చర్చిస్తున్న వైద్యులు

తిరుపతి తుడా : ప్రపంచాన్ని వణికిస్తున్న మధుమేహ వ్యాధి నియంత్రణలో ఆయుష్ వైద్యం కీలక పాత్ర పోషిస్తోందని వీజే ఆస్పత్రి అధినేత డాక్టర్ జ్యోతి కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆయుష్ వైద్య ప్రక్రియ ప్రాముఖ్యతపై సెమినార్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఆయుష్ వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జ్యోతి కుమార్ మాట్లాడుతూ ఆయుష్ వైద్యంతో దీర్ఘకాలిక సమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు. మధుమేహం సమస్యను అధిగమించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఏబీసీడీ అనే వైద్య సలహా సూచనలతో మధుమేహాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చని చెప్పారు. అందుకే ఆయుష్ వైద్యానికి ప్రాధాన్యత పెరుగుతోందని స్పష్టం చేశారు.

సాగుకు అందని సాయం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద సాయం అందించాలని రైతులు ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ మొదలైనా ఇప్పటికీ మీనమేషాలు లెక్కించడంపై మండిపడుతున్నారు. కేంద్రం తన వాటా నగదు జమ చేసినా రాష్ట్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చేతికి సొమ్ము అందితే తక్షణం పొలం బాట పట్టవచ్చని ఆశపడుతున్నారు. అదను తప్పిపోతున్న క్రమంలో అప్పులే శరణ్యమయ్యే దుస్థితి దాపురిస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ఇచ్చిన మాట చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీజన్‌కు ముందే రైతు భరోసా కింద ఆర్థిక చేయూత అందేదని గుర్తుచేస్తున్నారు.

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కరుణించని ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ నిధుల కోసం ఎదురుచూస్తున్న రైతాంగం
- పంట పెట్టుబడికి తప్పని అప్పుల తిప్పలు


చెట్టు ప్రారంభ దశలో వేరుశనగ పంట


పంట సాగుకు దున్నకాలు చేస్తూ, విత్తనాలు జల్లుతున్న రైతులు(ఫైల్)

పాకాల : మండలంలో అధికంగా వేరుశనగ, వరి, కంది, కూరగాయలు, మామిడి తోటలు, పూలు, పశుగ్రాసం వంటి పంటలను రైతులు అధికంగా పండిస్తుంటారు. 16,375 ఎకరాల విస్తీర్ణం పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం 8,600 ఎకరాలు సాగులో ఉన్నాయి. అందులో 7వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలతోపాటు, పలు రకాల ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారు. మిగిలిన 1,600 ఎకరాల్లో సాధారణ పంటలను పండిస్తున్నారు. సుమారు 14,800 మంది రైతులు సాగు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవడంతో రైతులందరూ సేద్యం పనులు ప్రారంభించారు. ముఖ్యంగా వేరుశనగ సాగు చేసే రైతుల దున్నకాలు చేపట్టి, విత్తనాలు వేసి, కలుపు తీసే పనిలో ఉన్నారు. నీటి ఆధారం ఉన్న రైతులు వరి కూడా సాగు చేస్తున్నారు. సుమారు 50 నుంచి 100 ఎకరాల వరకు వంగ తోటలతోపాటు పలు కూరగాయలు సాగులో ఉన్నాయి. మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపులకు ఇదే అనువైన సమయం. తోటల్లో దున్నకాలు చేసి ఎరువులు వేయాల్సిన సమయం కావడంతో పంట సాయం త్వరితగతిన ఇవ్వాలని రైతులు వేడుకుంటున్నారు.

ఇచ్చిన హామీ నెరవేర్చేనా?

ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం కింద సాయం అందిస్తే సన్న, చిన్నకారు రైతులందరికీ మేలు చేకూరే అవకాశం ఉంటుంది. మంచి దిగుబడి సాధించి ధరల నియంత్రణకు వెసులుబాటు ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో రైతులకు సాయం అందకపోతే చాలా మంది ఇబ్బందిపడే పరిస్థితి వస్తుంది. దీంతో పంట కొరత ఏర్పడడం తథ్యం. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సకాలంలో పంట సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

త్వరగా అందిస్తే బాగుంటుంది



ప్రస్తుతం వర్షా కాలం ప్రారంభమైంది. ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుకు ముందుగానే వేరుశనగ విత్తనాలను సరఫరా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడులకు అందజేస్తానన్న పంట సాయం మొత్తాన్ని త్వగా అందిస్తే బాగుంటుంది. దీంతో పెట్టుబడులకు అప్పు చేసే అవసరం ఉండదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

– కృష్ణయ్య, రైతు, మొగరాల పెద్దహరిజనవాడ, పాకాల

ఎలాంటి ఆదేశాలు అందలేదు



రైతులకు అందించే పంట సాయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవడంతో రైతులు తమకు అవకాశం ఉన్న పంటలను సాగు చేస్తున్నారు. పెట్టుబడి సాయంపై స్పష్టత వచ్చిన వెంటనే రైతులకు సమాచారం అందిస్తాం. పథకాన్ని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలన్ని విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

– పుష్పావతి, ఏఓ, పాకాల మండలం

పెద్దిరెడ్డిని విమర్శిస్తే సహించం


సహదేవరెడ్డి, సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్

భాకరాపేట : మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శిస్తే సహించే ప్రసక్తే లేదని సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం భాకరాపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేసే పెద్దిరెడ్డి కుటుంబంపై బీజేవై పార్టీ నేత రామచంద్రయాదవ్ అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. నోటా కంటే తక్కువ ఓట్లు సాధించిన రామచంద్రయాదవ్ ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి అనవసర మాటలు మానుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అనుమతి లేకుండా తుడా బంగ్లా స్వాధీనం

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)కు సంబంధించిన అతిథి గృహాన్ని ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పేరుతో స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. తుడా అధికారులకు చెప్పకుండా మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది బంగ్లాను తెరవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడ తుడా వీసీకి సంబంధించిన నేమ్ బోర్డు, ఫర్నిచర్‌ను సైతం దౌర్జన్యంగా బయట పడేశారు. తమకు ఎలాంటి సమాచారం లేదని బంగ్లా అప్పగించాలంటే కనీసం కలెక్టర్ అనుమతి అయినా కావాలని తుడా అధికారులు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ విషయాన్ని కమిషనర్ సీసీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మరో విధంగా కలెక్టర్‌కు సమాచారం అందించడంతో వివాదం ముదిరింది.

‘అభినయ’ కృషి.. అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్ : మన సంస్కృతి, సంప్రదాయ కళలను పరిరక్షించి భావితరాలకు అందించడంలో అభినయ ఆర్ట్స్ సంస్థ కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం రాత్రి నగరంలోని మహతి కళాక్షేత్రంలో జాతీయ నృత్య, నాటకోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు హనుమ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ అభినయ వంటి సంస్థల కృషితో సంప్రదాయ కళలు పునరుజ్జీవం పొందుతున్నాయన్నారు. అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులు, మెటర్నటీ సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారధిరెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్వీ అగ్రికల్చర్ వర్సిటీ అసిస్టెంట్ రూపేష్‌కుమార్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కళలు, కళాకారులను ప్రోత్సహిస్తూ కళా సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత 24 ఏళ్లుగా నిరంతరం కళాకారులను ఆదరిస్తూ నాటక, నృత్యాలను ఆదరిస్తున్న అభినయ ఆర్ట్స్ నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు . అనంతరం సాహితీవేత్త ధర్మయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్ రెడ్డి, అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అభినయ ఆర్ట్స్ జాతీయ స్థాయి నాటక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా విజయవాడ శ్రీసాయి బాబా నట్య మండలి వారి పృథ్వీరాజ్ రాసో పద్యనాటకం ఎంపికై హనుమ అవార్డుతో పాటు రూ.50 వేల నగదు బహుమతి అందుకుంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా కర్నూలు టీజీవీ కళాక్షేత్రం వారి శ్రీకృష్ణ కమలపాలిక పద్యనాటకం, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా జడ్చర్ల నవజ్యోతి కళానిలయం వారి మైరావణ పద్యనాటకం కళాకారులు హనుమ అవార్డులతో పాటు రూ.40 వేలు, రూ.30 వేలు నగదు బహుమతులు అందుకున్నారు. అలాగే సాంఘిక నాటిక విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం, ద్వితీయ ఉత్తమ నాటికగా కరీంనగర్ శ్రీచైతన్య కళాభారతి వారి చీకటి పువ్వు సాంఘిక నాటిక కళాకారులు హనుమ అవార్డులతో పాటు నగదు బహుమతులు అందుకున్నారు. అలాగే శాస్త్రీయ, జానపద నృత్య పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు.


ప్రథమ బహుమతి అందుకుంటున్న కళాబృందం


ఉత్తమ సాంఘిక నాటిక బహుమతి అందుకుంటున్న కళాకారులు

శాస్త్రోక్తం.. ధ్వజారోహణం


నంది వాహనంపై ఆదిదంపతులు

పాకాల : మండలంలోని ఊట్లవారిపల్లె సమీపంలో ఉన్న పాళ్యం కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి. అందులో భాగంగా రెండోరోజు ఆదివారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత స్వామి వారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి 7 గంటలకు నంది వాహనంపై పార్వతి పరమేశ్వరులను కొలువుదీర్చి గ్రామోత్సవం చేశారు. కార్యక్రమాలకు ఏటుకూరి సుబ్బరామానాయుడు, అత్తులూరి ఆనంద నాయుడు, కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సొంపల్లి చంద్రశేఖర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈఓ యువరాణి, అర్చకుడు హెచ్‌ఎస్ కృష్ణ మూర్తిశర్మ పాల్గొన్నారు.


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పబ్లిక్ గ్రీవెన్ రిడ్రెస్సల్ సిస్టమ్‌ను సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలుస్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




ఆలయం వెలుపల ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పోతుల సునీత, దువ్వాడ శ్రీనివాస్, నేతలు కొవ్వూరు శ్రీనివాసులు, రమేష్ యాదవ్, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్ రెడ్డి,

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పోతుల సునీత, దువ్వాడ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నేతలు కొవ్వూరు శ్రీనివాసులు, రమేష్‌యాదవ్, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్‌రెడ్డి, సినీ నటుడు సప్తగిరి, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం అందించారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.



సినీ నటుడు సప్తగిరి, జస్టిస్ కృష్ణ కుమార్

అపూర్వ సమ్మేళనం



దామలచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాల 1983–84 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తాము విద్యాభ్యాసం చేసిన స్కూల్‌కు చేరి నాలుగు దశాబ్దాల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉన్నత భవితకు దిశానిర్దేశం చేసిన గురువులను సత్కరించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులను కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ మేరకు కమిటీ అధ్యక్షుడిగా పుల్లూరు ఆనందయ్య, ఉపాధ్యక్షుడిగా ఎం.సుధాకర్ నాయుడు, కోశాధికారిగా విజయ రామానాయుడు, జాయింట్ సెక్రటరీగా గంధం వెంకటమునితోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

– తిరుపతి కల్చరల్

తైక్వాండో టోర్నీ ప్రారంభం

తిరుపతి సిటీ : సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదివారం జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నమెంట్ ప్రారంభించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రశేఖర్, డీఎస్‌డీఓ షేక్ సయ్యద్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమేనన్నారు. ఆ దిశగా దృష్టి సారించి రాణించాలని సూచించారు. శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని వెల్లడించారు. ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలకు కూడా స్పోర్ట్స్ కోటా ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు టి.ధనుంజయులు, రాష్ట్ర కార్యదర్శి శంకర్, నాయకులు ఎస్.జయరామయ్య, విజయ కుమారి, క్రాంతి కుమార్, మనోహర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ప్రారంభ కార్యక్రమంలో అతిథులు



ప్రజాసేవకు పునరంకితం




‘‘కేసులకు బెదరం.. ఒత్తిళ్లకు తలొగ్గం.. అదిలింపులకు భయపడం.. ప్రజాసేవకు పునరంకితమవుతాం.. జనం కోసం ఎంతవరకైనా నిలబడతాం.. విలువలకు కట్టుబడి ఉంటాం. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం.. పార్టీని మరింత బలోపేతం చేసుకుంటాం’’ అని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఎస్వీ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ నుంచి వెలుపలికి వచ్చిన ఆయన తొలుత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భారీ సంఖ్యలో తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ర్యాలీగా ముందుకు సాగారు.

– తిరుపతి రూరల్

శాకంబరీదేవి అలంకరణలో అమ్మవార్లు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుకట్ట సమీపంలో ఉన్న శ్రీశక్తిపీఠంలో కొలువైన శ్వేతవారాహీదేవి, మరకత శక్తి కాళీదేవి ఆదివారం భక్తులకు శాకంబరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకుడు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతీ ఈ మేరకు అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి పట్టువస్త్రాలు, పలు రకాల పుష్పాలు, కూరగాయలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు.


శ్వేత వారాహీదేవి


మరకత శక్తి కాళీదేవి